# అదె 'లంక' సాధించె 'అవని' భారముదించె

"**ఏ**మండీ ఎవరైనా పేరు మార్చుకోవాలంటే చెయ్యవలసిన పద్ధతి మీకు తెలుసా?'' అన్నది అవనిశర్మ భార్య.

"ఎందుకూ నీకా పద్ధతితో ఏం పని?'' అన్నాడు శర్మ.

"ఏం లేదు! నా పేరు కూడా 'అవని' అని మార్చుకుందామనుకుంటున్నాను. అక్కడితో మనది అవని కుటుంబం అవుతుంది. ఇక మనకి యింటి పేరుతో పని వుండదు. మీ నాన్నగారి పేరు అవనిశాస్త్రిగారు, మీపేరు సరేసరి! పతివ్రతలు భర్త పేరు చెప్పకూడదు కదా! సరే! మనపెద్ద పిల్లాడి పేరు 'ఆనంద అవని', రెండోవాడు 'కృష్ణ అవని'. పోనీ ఈ పిల్లల గురించి వచ్చే స్నేహితులైనా, ఆనందం వున్నాడా అని, కృష్ణ వున్నాడా అని అడగరు. మన యింటికి వచ్చి అవని వున్నాడా అని అడుగుతారు. నేను వంటింట్లోంచి వచ్చి'' ఏ అవని బాబూ, పెద్దవాడా, చిన్నవాడా "అని అడగటం. వీళ్ళ యిద్దరిలో ఎవరు పెద్దో తెలియని వాళ్ళు, యింజనీరింగ్ చదువుతున్నాడే'' అతను, అని అనటం, నేను "అదే మళ్ళీ యిద్దరూ యింజనీరింగ్ చదువుతున్నారు'' అని చెప్పడం, అదే పొడుగ్గా నల్లగా వుంటాడు, ఆ అబ్బాయి "అనివాళ్లు చెప్పడం. ఓహో 'ఆనంద అవని' యింట్లో లేడు, యిప్పుడే బయటకు వెళ్ళాడు అని నేను సమాధానం చెప్పి పంపేలోపులో, వంటింట్లో పోపు తగలడిపోతోంది'' అనిదీర్ఘంగా చెప్పింది భార్య, విసుగు ప్రదర్శిస్తూ.

"ఇంత విసుగు ప్రదర్శిస్తున్న నీకు సహనశీలి భూదేవి పేరు ఎందుకే, అసలు భూదేవి గొప్పతనం నీకేమి తెలుసు! తెలిస్తే ఈ పేర్ల గురించి యింత విసుగు ప్రదర్శించవు. భూదేవి ఎంతోమంది పాపాత్ములను సహనంతో మోస్తోంది. అసలు మనం ఏదైనో ఘోరం జరిగితే 'పాపం బద్ధలవుతోంది' అంటాం. అసలు ఈ పాపాలు భరించి, భరించి మధ్య మధ్యలో అవని తల్లి కంపిస్తుంది. అయినా మనం పాపాలు చేస్తూనే వుంటాం. ఇంక అవి భరించలేక, భూమి కంపించి బద్దలవుతుంది. భూదేవి యింత గొప్పది కనుకనే, ఆమె ఔన్నత్యం తెలిసిన వాల్మీకి, శ్రీరాముల వారిని 'క్షమయా పృథ్వీ సమః' అని వర్ణించాడు. అంచేత, నీవుభూదేవి జాతిలో పుట్టిన స్త్రీగా ఓర్పు వహించి శాంతించు'' అన్నాడు అవని శర్మ. ఆమెకు

పెళ్ళికాకముందు కూడా శర్మగారి కుటుంబంతో చుట్టరికం ఉంది. అందుచే ఆవిడకి వీళ్ల సంగతి తెలుసు. ఎంత పెద్ద విషయాన్నైనా చక్కగా వివరించి, ఎదుటివారిని సమ్మోహపరచి సమాధానపరుస్తారు, వీళ్ళు. అసలు వీరిది పెద్ద పండిత కుటుంబం. పండిత కుటుంబమే కాని, ఈ యింట శుంఠలు పుట్టలేదు, యిప్పటివరకూ.

శర్మగారి తండ్రి మాట్లాడుతుంటే, ఆ తేనె పలుకులు విని మైమరచి, ఎక్కవలసిన రైలు విషయం మరచిపోయి, రైలు తప్పిపోవడం వలన యింటికి వెళ్ళిపోయేవారు. శర్మగారి తాతగారి తరం నుండీ కూడా వీళ్ళ యింట్లో 'సుందరకాండ' పారాయణ జరుగుతోంది.

అటువంటి యింట అంతా జయమే కదా! హనుమత్కృప!

వీళ్ళని ముప్ఫై సంవత్సరాల బట్టి బాగా చూస్తోంది. అందుచే మారుమాటాడకుండా మళ్ళీ పోపు మాడుతుందేమో అని, వంటింట్లోకి వెళ్ళిపోయింది ఆవిడ.

ఎవరో వచ్చారు శర్మగారి దగ్గరికి! తనకు మనవరాలు పుట్టిందని, ఏదైనా మంచిపేరు చెప్పమని అడిగారు. పిల్లనక్షత్రం చూసి 'ధరణి' పేరు పెడితే దిగ్విజయంగా వుంటుందని చెప్పారు శర్మ.

"అయ్యా! మీరింత చెప్పాలా. మీ గొప్పతనం మాకు తెలుసు. మీ నాన్నగారిని ఒకసారి చూశాను. ఆయన శరీరమంతా దివ్యకాంతే! సరస్వతీదేవి వచ్చి మీ యింట్లో కూర్చున్నట్లు తోచింది నాకు' అని నమస్కారం పెట్టి వెళ్ళాడు, ఆ వచ్చినతను.

శర్మ జాతకాలు చెప్పినా, ముహూర్తాలు పెట్టినా డబ్బు తీసుకోడు. ఏదో భగవంతుడు ప్రసాదించిన విద్య నలుగురికి, ప్రతిఫలాపేక్ష లేకుండా ఉపయోగపడాలని! మానసిక ఔన్నత్యం అనేది, కుటుంబాల నుంచి రావాలి! ఇవేమైనా ఆటలా పదేపదే కృషిచేసి బాగా ఆడడానికి!

శర్మగారి తాతగార్ని, ఒక జమిందారు వేదం చదివితే వినాలన్న కోరికతో సగౌరవంగా, వారి మహల్‌కు తీసుకువెళ్ళారట. వేద పఠనం విన్న ఆయన పరవశించి, తాతగారికి పది ఎకరాల సుక్షేత్రమైన మాగాణి భూమి యిస్తానన్నారట. తాతగారు

కక్కుర్తి పడలేదు! పైగా, తాను "నప్రతిగ్రహీతనని" తన చేతికి ప్రతిగ్రహదోషం లేదనీ చెప్పారట. ఎంత ఔన్నత్యం!.

ఇలాగ, ధనార్జన మీద దృష్టిలేకుండా పిల్లల్ని చదివించి, పెళ్ళిళ్ళు చేస్తూ, సంసారం నడిపించడం కష్టమే. ఇంకా పూర్వపు రోజులైతే ఫర్వాలేదు! కాని ప్రస్తుతం గడ్డుకాలం!

శర్మగారి పెద్దబ్బాయి యింజనీరింగ్ చదువు ఈ ఏటితో ముగుస్తుంది. వాడు ఉద్యోగంలో చేరితే శర్మగారికి కొంత ఊపిరి సలుపుతుంది. అయినా వీళ్ళ చదువుల గురించి చాలా సుఖాలు వదిలేశారు. ఈయన భార్య. కూడా మహా యిల్లాలు, అవని పేరు అయితే పెట్టుకోలేదు కాని!

ఒకసారి పూజ చేసుకుని శర్మ ప్రత్యక్షదైవమైన సూర్యునికి నమస్కారం పెడదామని బయటకు వెడుతున్నారు.

"ఏమండీ!" అంటూ వెనక్కి పిలిచింది భార్య. "ఏమిటండీ! ఆ చిరిగిపోయిన పట్టు పంచెతో బయటకు వెళ్ళద్దంటే మానరు. ఇంకో కొత్త పంచె కొనుక్కోమంటే కొనుక్కోరు. మీతో ఎలా చెప్పండి! ఎవరైనా చూస్తే బాగుండదు కదా!" అంది భార్య.

"ఏదో అలవాటైపోయింది. రేపటి నుంచి, మనసందులోకి వెళ్ళి నమస్కారం చేసుకుంటాను. నీ వేడి నాపై చూపించి, సూర్యుడ్ని మరపించకు" అన్నారు శర్మ.

చాలా కష్టపడి, తినీ తినకా, ఆ దంపతులు పిల్లలిద్దర్నీ యింజనీర్లను చేశారు. ఇద్దరికి పెళ్ళిళ్ళు చేశారు. కట్నకానుకలు తీసుకోలేదు. ఏనోట విన్నా శర్మగారి కీర్తి గురించే. అసలు డబ్బు లేనప్పుడే కుటుంబ ఔన్నత్యం కాపాడుకోవాలి! డబ్బు వుండి కూడా చాలామంది మెట్లు దిగిపోయి, కట్నాలు తీసుకుంటున్న ఈరోజుల్లో కూడా, శర్మగారు ఉన్నత స్థాయిలోనే వున్నారు. అందుకే మంచి కుటుంబాలు ఎప్పటికీ మంచి కుటుంబాలే! ఈ జనవాక్యం విన్న శాస్త్రిగారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. "త్రికరణ శుద్ధిగా చేసిన పనులకు దేవుడు మెచ్చును లోకము మెచ్చును" అనే అన్నమయ్య కీర్తన మనసులో మెదిలింది. ఆయన ఆనందం రెట్టింపైంది!

ఆనంద అవనికి మంచి ఉద్యోగం వచ్చింది, ఢిల్లీ వెళ్ళిపోయాడు.

కృష్ణ అవని అమెరికా, మిత్రుల సహాయంతో, వెళ్ళి ఉద్యోగం సంపాదించాడు.

శర్మగారు, భార్యా ముసలివాళ్ళయ్యారు.

కొడుకులు మధ్యమధ్యలో ఉత్తరాలు రాస్తూవుంటారు. అవి చూసి పుత్రవాత్సల్యంతో, వాళ్ళని చూసినంత ఉప్పొంగిపోతారు దంపతులు.

ఒకసారి, ''ఏమండీ మన యిద్దరం, యీ ముసలితనంలో యిక్కడెందుకుండడం, పెద్దబ్బాయి దగ్గరికి వెళ్ళిపోదాం'' అన్నది భార్య.

''వాడు రమ్మనిచెప్పకుండా ఎలా వెడతాం. కోడలి ఉద్దేశ్యమేమిటో తెలియదు. అయినా అప్పుడే కొడుకు దగ్గరవుండ వలసినంత ముసలివాళ్ళమైనామా మనం! అలవాటైన ఊరిది. ఇక్కడ మనల్ని అందరూ ప్రేమగా చూస్తారు. ఢిల్లీ అయితే మన భాష కాదు. మన అలవాట్లు కావు. కొన్నాళ్ళుండు చూద్దాం'' అన్నారు శర్మ.

తల్లి మనస్సు పాపం! కొడుకుల్ని చూడకుండా వుండలేదు. రెండోవాడు, ఎలాగూ ఇతర దేశంలో వున్నాడు. మనదేశంలో వున్న ఈ పెద్దవాడ్ని కూడా వదలి, యిక్కెడెక్కడో వుండడం ఎందుకని ఆవిడ తలంపు.

కొన్నాళ్ళ తర్వాత ఆనంద అవనీ, కోడలు శర్మగార్ని చూడ్డానికి వచ్చారు. ఒక పదిరోజులున్నారు.

ఒకరోజు సాయంత్రం అందరూ కూర్చుని మాటలాడుకుంటూ ఉన్న సమయంలో, కోడలు అంది. ''మామయ్యగారూ! మీరు కూడా వచ్చి మాదగ్గరే వుండకూడదూ, అందరూ ఒకేచోట వుండచ్చు''.

''అవును, నాన్నా! మీతో చెపుతాం అనుకుంటున్నాను. ఎవరైనా చూస్తే బాగుండదు కూడానూ! మిమ్మల్ని మేము పట్టించుకోనట్లు వుంటుంది. నేనక్కడ ఒక మంచి యిల్లు తీసుకుని, మీకు తెలియజేస్తాను. అక్కడికి మీరు, అమ్మవచ్చేయండి'' అన్నాడు కొడుకు.

"సరే అలాగే కానీయండి!" అన్నారు శర్మ. భార్య కోరికలు కూడా ఆయన దృష్టిలో వున్నాయి.

తర్వాత కొంతకాలానికి, ఢిల్లీకి మకాం మార్చేశారు శర్మ. అక్కడికి వెళ్ళిన నాలుగు నెలలకి, ఆయన మాట్లాడే పద్ధతి, పరోపకార బుద్ధి, నిత్యపూజలు చూసి చాలామంది, ఆయన్ని కలవడానికి వచ్చేవారు.

ఢిల్లీ వెళ్ళిన తర్వాత శర్మకి బాగా కలిసొచ్చిందేమంటే, ఆయన చిన్ననాటి స్నేహితుడు ఒకతను, తనలాగే రిటైరయి, కొడుకు దగ్గరికి వచ్చేశాడు. పైగా దగ్గర దగ్గర యిళ్ళే కూడాను. "సృష్టిలో తీయనిది స్నేహమేనోయి" అనుకుంటూ రోజూ కలిసేవారు. ప్రొద్దున్నే వాకింగ్ వెళ్ళేవారు.

మామగారు, అత్తగారు వచ్చిన తర్వాత కోడలు కూడా భర్తని ఒప్పించి,

ఉద్యోగంలో చేరింది. ఢిల్లీ పెద్దసిటీ కదా! కోడలు ఆఫీసు చాలా దూరం! సాయంకాలం ఇంటికొచ్చేసరికి నీరసపడిపోయేది.

ఈ విషయం గురించే శర్మగారు ఒకసారి, భార్యతో అన్నారు "కోడలు

ఉద్యోగం ఎందుకు! వాడే పెద్ద జీతగాడు కదా" అని.

లౌక్యం తెలిసిన భార్య అంది. "వాళ్ళ సొంత విషయాల్లో మనం జోక్యం చేసుకోవడం మంచిదికాదు. మునుపటి రోజులు కావు. అంచేత మీరు ఊరుకోండి".

ఒకరోజు సాయంకాలం, కోడలు యింటికి వచ్చేసరికి యిద్దరు వ్యక్తులు ముందుగదిలో కూర్చున్నారు. శర్మ లోపల వున్నారు. వారిని చూసిన కోడలు 'ఏం పనిమీద వచ్చారు' అన్నట్లు చూసింది. వాళ్ళు చెప్పారు 'జాతకాల విషయంలో వచ్చామని'.

శర్మగారు ఒక గంటసేపు వాళ్ళు పట్టుకొచ్చిన జాతకాలు తీసుకుని క్షుణ్ణంగా పరిశీలించి ఏయే గ్రహాలకు, ఏయే పూజలు చేయించాలో చెప్పారు. ప్రస్తుత అంతర్దశల్ని బట్టి, రామాయణంలో ఏఏ సర్గలు పారాయణ చేయిస్తే మంచిదో కూడా చెప్పారు. వాళ్ళకి మంచి ఫలితాలు కనిపించాయి. వాళ్ళు పట్టుబట్టలు పారితోషికంగా యిద్దామని తెచ్చారు. కాని శర్మ వద్దన్నారు. తీసుకోలేదు.

"వాళ్ళంతట వాళ్ళిచ్చినప్పుడు తీసుకుంటే తప్పేముంది మామయ్యగారూ!" అంది కోడలు. శర్మస్వభావం కోడలికి కొత్త.

"బట్టలు మనం కొనుక్కుని కట్టుకుంటే వుండే ఆనందం, అనుభూతి వేరమ్మా! అయినా గవర్నమెంట్ దయవలన నాకు పెన్షన్ కూడా వస్తోంది" అన్నారు శర్మ.

ఒకసారి కోడలు, తన పుట్టిన రోజుకి, తన ఆఫీసులో వాళ్ళని టీ పార్టీకి పిల్చింది. సాయంకాలం వాళ్ళు వస్తారని భర్తతో చెప్పింది. "మీరు చిన్న సాయం చెయ్యాలి" అని భర్తను అడిగింది. "ఏమిటది" అన్నాడు ఆనంద అవని.

"మీరేమీ అనుకోకండి. మీ నాన్నగారి గుండూ, పిలక, ఆయన ధోవతీ చూస్తే మా ఆఫీసు వాళ్ళు నవ్వుతారేమో! మీ నాన్నగార్ని సాయంకాలం ఒక గంట బయట తిప్పుకు రండీ" అని అడిగింది. దురదృష్టం! ఆ మాటలు శర్మ చెవినపడ్డాయి. "సాయంకాలం బయట తిప్పుకురావడానికి నేనేమైనా కుక్కపిల్లనా" అని ఆయన చాలా బాధపడ్డాడు.

పాపం! ఆనంద అవని చాలా బాధపడ్డాడు. తండ్రితత్వం తనకి తెలుసు. ఆయన ఆఫీసులో పనిచేసేటప్పుడు కూడా, ఒకసారి ఒక ముఖ్యమైన మీటింగ్‌కి, ఆయన ఆఫీసరు శర్మను ప్యాంటు వేసుకుని రమ్మంటే", "అది కుదరదు, మీటింగ్‌కి రావద్దంటే మానేస్తా" అన్నారు శర్మ. ఆయన లేకుండా, ఎలా కుదురుతుంది! ఆఫీసు విషయాలన్నీ ఆయనకి తెలిసినంత ఎవరికీ తెలియవు. మీటింగ్‌కి మాత్రం పంచె కట్టుకునే వెళ్ళారు. ఆయన గుండూ, పిలకా కూడా ఈనాటివా! ఏమిటో సనాతన సాంప్రదాయాలు మంటకలిసిపోతున్నవి!

కొడుకు తిప్పుకురావడం ఎందుకని, తానే తన మిత్రుడితో కలిసి సాయంకాలం కూడా వాకింగ్‌కి వెళ్ళిపోయారు శర్మ.

ఎవరైనా జాతకాలు చూపించుకోవడానికి వస్తే, కోడలు ముఖం అదోలా పెట్టడం, పురాతన సంప్రదాయాల గురించి చిన్నబుచ్చడం, శర్మకి నచ్చలేదు. వస్తూనే జోళ్ళు గడపకి తగులుస్తూ వదలడం! గడపంటే లక్ష్మి కదా! ఇవన్నీ శర్మకి చాలా చికాగ్గా వున్నాయి.

కొడుకూ, కోడలు రమ్మంటేనే కదా తాము వచ్చింది. ఇప్పుడేమిటి కోడలు యిలా చేస్తోంది! కొడుకు కూడా 'గుండూ పిలకా అయితే ఏమవుతుంది' అని గట్టిగా అడగలేడే. పైగా ఢిల్లీ రమ్మనప్పుడు కూడా, కొడుకు అన్నమాటలు శర్మకి నచ్చలేదు. అప్పుడు, "ఎవరైనా, చూస్తే బాగుండదు. మిమ్మల్ని పట్టించుకోనట్లు ఉంటుంది" అన్నాడు. అంటే సంఘంలోని వ్యక్తుల గురించి, ఢిల్లీ రమ్మన్నాడా!

కొంతకాలం తర్వాత, యింక మనస్సులో దాచుకోలేక ఈ విషయాలు తన మిత్రుడితో, మార్నింగ్ వాక్‌లో చెప్పాడు. అవని శర్మ బాధపడుతున్నట్లు గ్రహించి, కొంచెం అతని బాధ తగ్గద్దామని, వాళ్ళు కాలేజీలో చదువుకున్నప్పటి విషయాలు ప్రస్తావించాడు, శర్మ మిత్రుడు.

"అరే! అవనీ జ్ఞాపకం వుందా? నిన్ను కొంతమంది 'అవనీ' అని పిలుస్తూంటే అమ్మాయిని పిలుస్తూన్నట్లు వున్నదని, అసలు ఆ మీసాలు తీసేస్తే, నీ గుండ్రని మొహం ఆడపిల్ల మొహంలా వుంటుందని అనేవారని జ్ఞాపకం చేశాడు.

మిత్రుడు చేసిన ప్రయత్నం కొంత ఫలించింది. అవనిశర్మ అందుకున్నాడు. "నీ పూర్తి పేరు లంక కృష్ణమూర్తి", అయినా మొత్తం కాలేజీలో చదివిన అయిదేళ్ళు నిన్ను ఎవడైనా అలా పిలిచాడా, నిన్ను మాత్రం 'లంక లంక' అని పిలుస్తూ. 'అరే! కృష్ణమూర్తీ! లంకలో వాళ్ళంతా రాక్షసులు కాదులే, నువ్వు మంచివాడివే' అని ఆట పట్టించేవారు కాదేమిటి?" అన్నాడు శర్మ, ఉక్రోషంతో.

మళ్ళీ అసలు విషయానికి వస్తూ - "ఇంతకీ నేను బాధపడడం తప్పు అంటావా!" అని అడిగాడు శర్మ.

"తప్పనికాదు. ఇటువంటి విషయాలు అన్ని కొంపల్లో వున్నాయి. పట్టించుకోకూడదు. అంతే! నువ్వేమిటి! కొడుకూ, కోడల్ని వదిలిపెట్టి వెళ్ళిపోతానంటావు. ఈ ఒక్క కొడుకే కదా మనదేశంలో వున్నాడు. ప్రతి యింటిలో ఒక మట్టిపొయ్యి వుంటుంది. క్షమించడం దైవలక్షణం!" అని చెప్తూన్న కృష్ణమూర్తితో, శర్మ అన్నాడు.

"వాళ్ళు క్షమించమని అడిగితే కదా!"

"వాళ్ళు చేసేవి చాలా తప్పులైనప్పుడు ఎన్నిటికని క్షమించమని అడుగుతారు".

శర్మ తత్వం, లంకకి తెలుసు. వాళ్లది తప్పు అంటే కాని, మాట వినడు.

"నెలకొకసారి మనం పెన్షన్ తీసుకుంటున్నాం కదా, అలాగే ప్రతినెలా వాళ్ళని క్షమిస్తే, వదిలిపోతుంది" అన్నాడు లంక.

'ఇదీ బాగానే వుంది' అనుకున్నాడు అవని.

అవనిశర్మకి "అదె లంక సాధించె, అవని భారము దించె" అన్న శ్రీరాముల వారికి సంబంధించిన అన్నమయ్య కీర్తన గుర్తుకొచ్చింది.

(నవ్య, 16-2-2005)